మామూలుగా, కులాసాగా పిలుస్తాను. కాదుకాదు-వద్దు ప్రభూ! నన్నతణ్ణి పిలవనివ్వకు.

ప్రభూ! నిజంగా నువ్వు నన్నతణ్ణి పిలవనివ్వవా? నిజంగా? నువ్వు ఊరుకోలేవా ప్రభూ! అతడు నన్నీ నిమిషాన్నే పిలిచేటట్టు చెయ్యమని కూడా నేను నిన్నడగడంలేదు. కాస్సేపట్లో చెయ్యనీ. ఐదువందలు లెక్కపెడతాను. ఈలోపల అతడు నాకుఫోన్ చెయ్యకపోతే, అప్పుడు నేనతనికి ఫోన్ చేస్తాను. అప్పుడు పిలుస్తాను. కాని ప్రభూ! ఈలోపలే, ఈలోపలే అతనిచేతనే నాకు ఫోన్ చేయించు ప్రభూ! అతడు నన్ను పిలిచేటట్టు చెయ్యి ప్రభూ - ప్రభూ!

ఐదు, పది, పదిహేను, ఇరవై, ఇరవైఐదు, ముప్పై, ముప్పైఐదు....

(అనువాదం: అడపా రామకృష్ణరావు)

# ఆవాహన

★ శ్రీరంగం శ్రీనివాసరావు

హేమంతకాలంలో మేం ఏం భావించామో, సగం రాత్రివేళ ఏం భాషించామో, ఎడారి దారిలో మేం ఏం చేశామో ఎందు కదంతా ఇప్పుడు? రక్షించు మమ్మల్ని చేజేతులా మా శిరస్సులమీదకి నీ ఆగ్రహజ్వాలల్ని ఆకర్షించకుండా, చీమల విషాదమరణం మాకు లేకుండును గాక—

మాయలమరాఠీ! మమ్మల్ని కాపాడు.

భయానకమైన మా గృహాల ప్రచండమైన గబ్బిలపు నీడలనుండి, సరిహద్దుల తొలగింపునుండి, ప్రణయ సందేశాలనుండి, సైతానుపలికే సాంత్వన వచనాలనుండి

సబ్బినస్పెక్టరుగారూ! మమ్మల్ని రక్షించండి!

అభిప్రాయాలనుంచి,ఆత్మీయ బంధనాలనుంచి, జాలినుంచి, సిగ్గునుంచి, ఇతరులకు బోధించాలనే అభిలాషనుంచి

అపరాధపరిశోధకా! మమ్మల్ని కాపాడు.

కిందామీదాఉండకపోవడంనుంచి, ఎంతతో స్తే అంత చేసి అనుభవించడంనుంచి, వాయిదా వేసిన పాపం, ఫాయిదాలేని గాయంనుంచి, మధ్యాహ్నపు బరువునుంచి, అర్ధరాత్రి భయంనుంచి

అల్లాటప్పయ్యా బాబూ! మమ్మల్ని కాపాడు.

శస్త్రవైద్యుని మంత్రహస్తంనుంచి, ఎర్రదీపాల వింత ఆకర్షణనుంచి, గుండంతోకే్కవాళ్ళ మృత్యువాంఛనుంచి

కస్తూరి రంగా! మమ్మల్ని కాపాడు.

తోసుకొచ్చే దుఃఖాలనుంచి పొత్తికడుపులో నొప్పినుంచి, అపాయం సూచించే నక్షత్రంనుంచి. అగ్నిగంశం నుంచి, హరిదాసూ! మమ్మల్ని కాపాడు.

వెనక భాగాలలో అకస్మాత్తుగా అర్థంకావడంనుంచి, రమ్యదృశ్యాలు క్రమక్రమంగా కలిగించే జ్ఞానంనుంచి, పుస్తకాల్లో చదువుకున్న ముక్కలనుంచి

ప్లాట్‌ఫారాలమీద వినిపించేసంభాషణలనుంచి

విభూతిపండూ! మమ్మల్ని విడిపించు.

స్పష్టంగా చూడగలిగిన క్షణాలలో, కరతాళధ్వనుల ఘడియలో, పరాజయం పొందినచోట, స్నేహితులు దగాచేసిన సమయంలో

షెర్లాక్ హోమ్స్! మమ్మల్నికాపాడు.

ముఖ్యపట్టణాలలో నృత్యంచేసే వాళ్ళకోసం, రంపం ధరించిన వాళ్ళకోసం, శైలిసమస్యలు చర్చించే వాళ్ళకోసం, శరీరాన్ని గుర్తించగలిగిన వాళ్ళకోసం, సమస్తమూ అనుభవించిన వాళ్ళకోసం, ఏమీ చేతకాని వాళ్ళకోసం

భజగోవిందం! మమ్మల్ని విను.

నిద్రపట్టనివాళ్ళకోసం,శరణాలయాలలోనివాళ్ళకోసం, చిలుకా గోరింకల్లాగ బతుకుతున్న వాళ్ళకోసం, ఒంటరిగా నిద్రించే వాళ్ళకోసం

పిల్లి పిల్లల తల్లీ! మమ్మల్ని విను.

భక్తులకొరకు, పాషండులకొరకు, ఈడురాని వాళ్ళకోసం, ఒకరినికోరే ఇద్దరి కోసం, ఎదిరించే ఏడుగురికోసం

సులోచనాల జోడూ! మమ్మల్ని విను.

ఉరుము చప్పుడు విని జడుసుకొనే కన్యకోసం, భర్తని లొంగ దీసుకున్న భార్యకోసం, ఆఫ్రికాను ప్రేమించే అవివాహిత కోసం

భయంకర భల్లూకమా! మమ్మల్ని విను.

విభజనవల్ల పెరిగేవాళ్ళకోసం, అమాయక త్వాన్ని ప్రకటించే వాళ్ళకోసం, మరణాన్ని నిరాకరించేవాళ్ళ కోసం

నీలి రంగు సివంగీ! మమ్మల్ని విను.

అరువు పుచ్చుకొనే వాళ్ళకోసం, అప్పిచ్చే వాళ్ల కోసం, ఎదురుపడితే మొగం చాటుచేసేవాళ్ల కొరకు, ఇంట్లో ధర్మరాజని పేరు పొందిన వాళ్ళ కోసం

రెండు తలల హంసా! మమ్మల్ని విను.

ఆతపస్నానంచేసే వాళ్ళకోసం, మర్యాదగా దుస్తులు ధరించే వాళ్ళకోసం, తమ గొప్ప తనం గురించి సందేహంలేని వాళ్ళకోసం, భజనచెయ్యడం నేర్చుకున్న వాళ్ల కోసం

శ్వేతాశ్వమా! మమ్మల్ని విను.

బాధపడాలని నిశ్చయించుకున్న వాళ్లకోసం, ప్రకృతిని శాసించగలమని విశ్వసిస్తున్న వాళ్ళ కోసం

బాకా ఊదేవాడా! మమ్మల్ని విను.

ఎగరగల వాళ్ళకోసం, ఇబ్బంది పడుతున్న వాళ్ళ కోసం, నిరుత్సాహాన్ని ఆరాధించుతున్న వాళ్ళ కోసం

అందమైన అమ్మాయీ! మమ్మల్ని విను.

పొదరింట్లో బతకదలచుకున్న వాళ్ళకోసం, కొండెక్కేవాళ్ళకోసం, ఇక్ష్వాకుల కాలం ఇప్పుడు కావాలనే వాళ్ళకోసం

రంగూన్ రాడీ! మమ్మల్ని విను.

మౌనవ్రతం అవలంబించిన వాళ్ళకొరకు, అవలంబించని వాళ్ళకోసం, కొడుకులు చనిపోయిన తర్వాత గుళ్ళకి వెళ్లేవాళ్ళ కోసం

ఏడూళ్ళ చక్రవర్తీ! మమ్మల్ని విను.

పరాన్న భుక్కులకోసం, శవాన్న భోక్తల కోసం, జంట గులాబి పూలకోసం, మచ్చికయిన జంతువుల కోసం

ఆకుపచ్చ మనిషీ! మమ్మల్ని విను.

నీదయ, మరి నీ ప్రజలని ఎలా పసుకోక్కబెడతావో

ప్రభూ! నిన్ను ప్రార్థిస్తున్నాం, వినవూ?

(*W-H Auden* రచనకు అనువాదం)

"జాతీయ స్థయిర్యమునకూ ప్రపంచవ్యవస్థకూ కూడా నూతనజీవిత విధానమొకటి మూలము కావాలి. అది అన్ని తరగతుల, అన్ని జాతుల, అన్ని దేశముల ప్రజల ప్రయోజనులనూ కాపాడగలిగి ఉండాలి. ఎవరైతే స్వార్థమనే అవిద్యాంధకారమునుండి తప్పించుకొని బయటపడ్డారో, వారే ప్రపంచశాంతికోసం పాటుపడి దానిని స్థాపించగలవారు. ప్రపంచశాంతి అంటే మానవకోటియొక్క జీవితంలోనూ, ప్రవర్తనలోనూ, కొన్ని సార్వలౌకిక సిద్ధాంతాలూ, ఆదర్శాలూ రూపం దాల్చడమే. అందుకోసం నీతిని వికృతము చేయని, మానవజీవితమును వినాశనము చేయని, ఆయుధములద్వారా మనము పోరాడాలి. ఈ ప్రయత్నంలో మనకెట్టి కష్టనష్టాలు తటస్థించినా, మనము ఓర్చుకోడానికి సంసిద్ధంగా ఉండాలి."—డాక్టర్ రాధాకృష్ణన్.